క్లుప్తంగా

శ్రీరంగరాజపురం తహసీల్దారుగా బెన్నురాజు



శ్రీరంగరాజపురం: మండల తహసీల్దారుగా బెన్నురాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఇక్కడ తహసీల్దారుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, సిబ్బంది సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన ప్రజల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా వినతులు స్వీకరించారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండలంలోని కొత్తపల్లి సచివాలయ పరిధిలో ఉన్న 49కొత్తపల్లిమిట్ట, బీసీ కాలనీ, కొటార్లపల్లి, కొత్తపల్లి, 48 బసివిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని స్థానిక సర్పంచ్ డిల్లయ్య అన్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొంటారన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధి అమలు, గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాబు



బాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నగరి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరి పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆర్.బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ శ్రేణులు బాబును దుశ్శాలువలతో సత్కరించారు. అనంతరం బాబు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్, నాయకులు చిరంజీవిరెడ్డి, అల్లాపిచ్చై, దేశయ్య, నాగేశ్వరరావు, కుమార్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గంగాధర నెల్లూరు: మండల కేంద్రం జీడీ నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు తప్పక పాల్గొనాలని కోరారు. భవిష్యత్ ప్రణాళికపై సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.


నాడు-నేడు పనుల పరిశీలన



కీళపట్టు స్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంఈఓ శ్రీదేవి పరిశీలించారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన ఆమె పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని కాంట్రాక్టరుకు సూచించారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని హెచ్ఎంను ఆదేశించారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు.

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలత

పుత్తూరు రూరల్: చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నల్లో మంచి పోషకాలు ఉన్నాయని, వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.బి. శ్రీలత సూచించారు. సోమవారం వడమాలపేట మండలం కాయంపేట గ్రామంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల నిమిత్తం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు-2023 ప్రాముఖ్యత గురించి వివరించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని చెప్పారు. అలాగే రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. పరిసరాల పరిశుభ్రత, నీటి ప్రాముఖ్యత, ఆహార భద్రత, పోషకాహార, ప్రాముఖ్యత, సేంద్రియ పంటల విధానం గురించి వివరించారు.



పుత్తూరు: మహిషాసురమర్దినిగా ఆరేటమ్మ, పార్వతీదేవిగా ద్రౌపదీదేవి, కామాక్షమ్మ దేవిగా బంగారమ్మ, పాలసముద్రం: బాలాత్రిపుర సుందరిగా పడవేటమ్మతల్లి, పరమేశ్వరీ దేవి, చెవుటి గంగమ్మ తల్లి

జగజ్జననీ.. మనసాస్మరామి..

- భక్తి శ్రద్ధలతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- దేదీప్యమానంగా అమ్మవారి ఆలయాలు
- భక్తులతో పోటెత్తుతున్న ఆలయాలు





దాక్షాయణి అలంకరణలో వాసవీదేవి, నింద్ర: బాలా త్రిపుర సుందరిగా దుర్గాదేవి, మీనాక్షీ అలంకరణలో అల్లియల్లమ్మ తల్లి, మీనాక్షీ అలంకరణలో అల్లియల్లమ్మ తల్లి

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో సోమవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి కౌమారి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అర్చకులు దుర్గాప్రకాష్ మంత్రోచ్చరణ నడుమ బ్రాహ్మణ సంఘ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ అర్చన చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో టీటీడీ ఆధీనంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణేశ్వరి అమ్మవారు బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం, పంచామృతాభిషేకం, మంత్ర పుష్పం, మంగళహారతి నిర్వహించారు. ఉత్సవ అమ్మవారికి దాక్షాయణి అలంకరణ, మూలవర్లకు స్వర్ణాలంకరణ చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉభయదారులుగా వ్యవహరించిన దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిషాసురమర్దినిగా ఆరేటమ్మ..

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ దేవత ఆరేటమ్మను మహిషాసుర మర్దినిగా పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. పట్టణానికి చెందిన లోకనాథంరెడ్డి, జయలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో అమ్మవార్లను ఊరేగించారు.

కామాక్షిదేవిగా అలంకరణలో బంగారమ్మ..

కార్వేటినగరం: మండలంలోని బంగారమ్మ అమ్మవారు కామాక్షమ్మ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులైన చాముండేశ్వరి, శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో కామాక్షిదేవి అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథం మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు. అలాగే ఆలత్తూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ, మిద్దినెత్తం పడవేటమ్మ అమ్మవారు, నొచ్చిలి గ్రామంలో గంగాధరేశ్వర స్వామి సమేత పరమేశ్వరి దేవి, గంగాదేవి అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.



ఓంశక్తి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు



బుగ్గదేవాలయంలో అమ్మవారి ఊరేగింపు



కౌమారి అలంకరణలోని కామాక్షి దేవి వద్ద కుంకుమ అర్చన చేస్తున్న మహిళలు

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండలంలోని అల్లియల్లమ్మ తల్లి రెండవ రోజు మీనాక్షీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుబ్రమణ్యం, అలంకరణ ఉభయదారులు మునిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో భక్తిభావం



పాదిరికుప్పంలో భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్న ప్రబోధా సేవాసమితి సభ్యులు

కార్వేటినగరం: హిందూమత బలోపేతానికే భగవద్గీత గురించి ప్రచారం చేయడం జరుగుతోందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు అశోక్ బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాదిరికుప్పం, కత్తెరపల్లి, అమ్మపల్లి,వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు,దేవలంపేట గ్రామాల్లో భవద్గీత గురించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత పఠనంతో భక్తిభావం పెరుగుతుందన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి-ఇందూ విజ్ఞాన వేదిక సభ్యులు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ విజ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై లక్ష్మీ నారాయణుడు



తిరుచ్చి వాహనంపై లక్ష్మీనారాయణ స్వామి

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం తిరుచ్చి వాహనంపై స్వామివారిని ఘనంగా ఊరేగించారు. సాయంత్రం స్వామివారిని వేదపండితులు వేద మంత్రోచ్చరణలతో, డోలు, సన్నాయి వాయిద్యాలతో శేష వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు కేఎస్ శ్రీధర్, అడ్వొకేట్ వాసు, సుమిత్ర, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



నింద్రలో బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సమాఖ్య సిబ్బంది

నింద్ర: బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ వెలుగు సమాఖ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో వెలుగు సమాఖ్య సిబ్బంది గ్రామీణ ప్రజలకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం చంద్రకళ మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించడం, పాల్గొనడం, చట్టరీత్యా నేరమన్నారు. అబ్బాయిలకు 21 ఏళ్లు, అమ్మాయిలకు 18 ఏళ్లు నిండాకే పెళ్లి చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు నాగేశ్వరావు, ప్రభాకర్, గిరి, సంఘమిత్రలు ,అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణకు కృషి

గంగాధర నెల్లూరు: మండలంలోని స్వయం సహాయక మహిళా సంఘం కార్యాలయంలో ఏపీఎం చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం బాల్యవివాహాల రహిత భారతదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలతో కలిసి బాల్యవివాహాలు పూర్తిగా అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాల లోపు ఉన్న అమ్మాయిలకు, 21 ఏళ్లలోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే, ఆ సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: బాల్య వివాహాలను అరికట్టి ఆడపిల్లలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వరదరాజు తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మహిళా పోలీస్ జీవనరేఖ, నీరజ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల మాతాశిశు మరణాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

మాధవయ్యకు ఉప ముఖ్యమంత్రి పరామర్శ



మాధవయ్యను పరామర్శిస్తున్న నారాయణస్వామి

వెదురుకుప్పం: తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో గుండెకు సర్జరీ చేసుకుని చికిత్స పొందుతున్న మండలంలోని మాంబేడు గ్రామానికి చెందిన మాధవయ్యను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. సోమవారం ఆస్పత్రికి వెళ్లి మాధవయ్యకు అందుతున్న వైద్యచికిత్స, ఆరోగ్యంపై వాకబు చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట శ్రీరంగరాజపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మునస్వామి ఉన్నారు. అదేవిధంగా వెదురుకుప్పం గ్రామంలో మృతి చెందిన వృద్ధురాలు కాంతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంతమ్మ కుమారుడు ఆంజనేయులు రెడ్డి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ రాధిక తదితరులు శివాజీ ఉన్నారు.

పుష్పకు పరామర్శ

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని ఉప్పిలిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గోవిందయ్య భార్య పుష్ప అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సోమవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

'ధరణి' డిపాజిట్‌తో అధిక వడ్డీ

నగరి: ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ సహకార బ్యాంకు నగరి బ్రాంచ్ మేనేజర్ జె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో డిపాజిట్ కింద 450 రోజులకు 8 శాతం వడ్డీ ఇస్తామని, సీనియర్ సిటిజన్స్‌కు 8.5 శాతం వడ్డీ ఇస్తామన్నారు. డిపాజిట్లకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణ ఉందన్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే అధిక వడ్డీ వస్తుందన్నారు. ఈ పథకంలో ఎంతైనా డిపాజిట్ చేయవచ్చని, కనిష్ట డిపాజిట్ రూ.1000 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9949826948లో సంప్రదించాలన్నారు.

హార్మోనియం వితరణ



పాండురంగయ్య శెట్టిని సన్మానిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ గ్రామ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రానికి టీకేఎంపురం గ్రామానికి చెందిన పాండురంగయ్య శెట్టి కుటుంబ సభ్యులు హార్మోనియం వితరణ చేశారు. ఆలయంలో వేడుకల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఉచితంగా హార్మోనియం పెట్టెను అందించారు. ఈ సందర్భంగా దాతను అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

మండల మీట్ రేపు

పాలసముద్రం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్యామల అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి తగిన రికార్డులతో సంబంధిత అధికారులు రావాలన్నారు. మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కాశీ క్షేత్ర దొణల్లో 'గంగ'



దొణల్లో ప్రవహిస్తున్న నీరు

నగరి: మండలంలోని బుగ్గ అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని దొణల్లో నీరు ప్రవహిస్తోంది. ఏడాదికి పైగా వర్షాలు లేక అన్ని ప్రాంతాలు ఎండిపోవడంతో బుగ్గ ఆలయంలోని దొణల్లో వచ్చే నీరు ఆగిపోయింది. దీంతో ఆలయానికి వచ్చినా చారిత్రక విశిష్టత కలిగిన దొణలను దర్శించడానికి భక్తులు వెళ్లే వారు కాదు. ఆలయ చరిత్ర మేరకు వనవాస సమయంలో పాండవుల కాశీని పోలిన విధంగా ఆలయంలో దేవతల అమరిక ఉండడం, ఆలయంలో గంగాజలం లేకపోవడాన్ని గమనించి కాశి, గుహ, భవాని, మణికర్ణిక, యమున అనే ఐదు దొణలను సృష్టించినట్లు చరిత్రకారులు చెబుతారు. నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియని రీతిన ఇక్కడి దొణల్లో నిత్యం నీటి ప్రవాహం ఉండేది. కాలక్రమేణా పరిసర ప్రాంతాల్లో వచ్చిన మార్పులు, వర్షాలు లేకపోవడంతో నీటిప్రవాహం ఆగింది. ఎక్కువగా వర్షాలు పడే సమయంలో మాత్రమే మూడు లేక రెండు దొణల్లో నీటి ప్రవాహం ఉండేది. ఏడాదికి పైగా వర్షాలు ఎక్కువగా లేకపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా ఆగిపోయింది. ప్రస్తుత వర్షాలకు మూడు దొణల్లో నీరు ప్రవహిస్తుండడంతో వాటిని చూడడానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు. స్థానికులు, ఆలయానికి విచ్చేసే భక్తులు, అయ్యప్ప మాలధారణ భక్తులు ఈ దొణల్లో వచ్చే నీటిలో స్నానం ఆచరించి కాశీవిశ్వేశ్వరున్ని దర్శించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం రామసముద్రం సచివాలయ కన్వీనర్ దినేష్‌యాదవ్ మామ వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులు మండడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచ్ కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రూరల్ మండల అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం భరోసా





మెడికల్ కిట్లు అందుకున్న వారితో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, విజయపురం: కేవీపురంలో

నగరి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి, ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎం.కొత్తూరు సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం, మందులు అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, ఎంపీడీఓ లీలామాధవి, సీడీపీఓ కృష్ణవేణి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ నరసింహులు, మెడికల్ ఆఫీసర్ రమేష్, వైద్య నిపుణులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి): జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని వైస్ ఎంపీపీ బాలాజీ అన్నారు. సోమవారం కేవీపురం సచివాలయ పరిధిలో సర్పంచ్ రజిని అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రత్యేక అనుభవం కలిగిన వైద్యులు రోగులను పరీక్షించి, వారికి అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారని ఆయన తెలిపారు. డాక్టర్ సోమశేఖర్ బృందం 1000 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమలేశ్, గాయత్రి, చంద్ర, ప్రవీణ్, విష్ణుప్రియ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓపీఆర్‌డీ బాబు, పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్, స్థానిక నాయకులు హరినాయుడు, బాలకృష్ణమనాయుడు, ఎం.అగరం సర్పంచ్ సుధాకర్, సీహెచ్ఓ సుబ్బరత్నమ్మ, ఏఎన్ఎం జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

×జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఎంపీపీ హేమలతారెడ్డి అన్నారు. సోమవారం గుంటిపల్లి సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పిల్లారికుప్పం సచివాలయ పరిధిలో స్థానిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన దాదాపు 530 మందికి పైగా రోగులకు వైద్యులు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే 35 మందికి కంటి అద్దాలును పంపిణీ చేశారు. సర్పంచ్ లోకేష్ , జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, తహసీల్దార్ బెన్నురాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, డాక్టర్ పల్లవి, గౌరి, బాలసుబ్రమణ్యంరెడ్డి, సందీప్ రాజు, మండల కన్వీనర్ మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చాం

- జగనన్నకు సైనికులుగా నిలవాలి
- పేదవాడు మరింత బాగు పడాలంటే ఏపీకి జగనే సీఎం కావాలి
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో నేతలు





మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సమావేశంలో పాల్గొన్న నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

వెదురుకుప్పం: 2019 ఎన్నికలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ప్రతి కుటుంబానికి తోడుగా ఉంటూ సంక్షేమ పథకాల ద్వారా పేదల కుటుంబాలకు అండగా నిలిచిన సీఎం జగనన్నకు ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి అన్నారు. సోమవారం వెదురుకుప్పం మండల కేంద్రంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ద్వారా శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజల కోసం, పేదలకు సేవ చేయడం కోసం పుట్టిన వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగున్నరేళ్లలో చేసి చూపించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కేవలం అర్హతనే కొలమానంగా తీసుకుని నేరుగా గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని స్పష్టం చేశారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేసి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన ఏకైక సీఎం జగనన్నే అన్నారు. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పేదల గుండెల్లో గూడు కట్టుకున్న జగనన్నకు ప్రజలు మరోమారు అండగా నిలవాలన్నారు.

మరోమారు జగనన్నను సీఎంను చేసుకుందాం

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు జగనన్న అన్నగా, తమ్ముడిగా, మనవడిగా మేనమామగా అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియం చదువులు, ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం, డ్వాక్రా మహిళలకు నాలుగు దఫాల్లో రుణమాఫీ తదితర ఎన్నో పథకాల ద్వారా ఆదుకున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ మీ కుటుంబానికి మంచి జరిగితేనే జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భవిష్యత్‌లో మరిన్ని పథకాలను అందాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని కోరాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బట్టే సుబ్రమణ్యం, ఎంపీటీసీ భాస్కర్, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణా రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, రోశిరెడ్డి, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.